క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి రూ.10,116 విరాళం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ గంగానమ్మ తల్లి దేవస్థాన పునర్నిర్మాణ పనులకు బోనుల వీరయ్య, విజయలక్ష్మి రూ.10,116 విరాళం ఇచ్చారు. ఈ విరాళాన్ని గుడ్లవల్లేరు నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, డైరెక్టర్ వల్లభనేని కృష్ణప్రసాద్‌కు శుక్రవారం అందజేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, లయన్స్ మాజీ చైర్మన్ పోలవరపు వెంకట్రావు, ఆలయ ధర్మకర్తలు మురాల నరేష్, రవి, వైశ్య ప్రముఖుడు కంతేటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన హోమం



పమిడిముక్కల: మంటాడ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు తరలివచ్చి హోమంలో పాల్గొన్నారు. స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష వద్దు

ముదినేపల్లి రూరల్: హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపరాదని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ప్రతినిధులు, ముదినేపల్లి పంచాయతీ కార్యదర్శి జి.రమేష్, సీహెచ్ నాగలక్ష్మి అన్నారు. ముదినేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద హెచ్ఐవీ నివారణపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేసి స్థానికులతో ర్యాలీ నిర్వహించారు.

వెంకట్రాజుకు నివాళులు



ముదినేపల్లి రూరల్: మండలంలోని చిగురుకోటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కోమటి అమల వెంకటరాజు భౌతికకాయానికి పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ శుక్రవారం నివాళులర్పించారు. వెంకటరాజు శుక్రవారం ఉదయం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న డీఎన్నార్, ఎంపీపీ ఆయన నివాసానికి చేరుకుని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



కాజ(మొవ్వ): మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మిలాద్ ఉన్ నబీని మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కాజ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ సయ్యద్ మతిన్, ఇమామ్ ఉమర్ బైగ్, మసీద్ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు దానధర్మాలు చేశారు. పెదపూడి, భట్లపెనుమర్రు, మొవ్వ, కోసూరు శివారు తురకపాలెం, నిడుమోలు గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మహ్మద్ ప్రవక్త జయంతి ఉత్సవాలు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ముస్లింలు జరుపుకున్నారు. ముదినేపల్లి, గురుజ, సంఘర్షణపురం మసీదుల్లో ప్రార్థనలు చేశారు.

కృష్ణమూర్తి సేవలు చిరస్మరణీయం



కలిదిండి(కైకలూరు): ప్రజా సేవలో యలవర్తి కృష్ణమూర్తి ముందుండే వారని పలువురు వక్తలు కొనియాడారు. కలిదిండి సెంటర్‌లో విగ్రహం వద్ద ఆయన కుమార్తె, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు నున్న రమాదేవి ఆధ్వర్యంలో ఆయన వర్ధంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కలిదిండి పీఏసీఎస్ అధ్యక్షుడిగా, రెండు పర్యాయాలు సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్‌గా ఆయన సేవలు అందించారన్నారు. నాయకులు పోకల జోగిరాజు, శ్రీనివాసచౌదరీ, శ్రీహరి, బీకేఎం.నానీ, నల్లగోపుల చలపతి, శ్రీనివాసరావు, రవీంద్ర, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

గురువు స్థానం అత్యంత ప్రధానం

కైకలూరు: సమాజంలో గురువు స్థానం అత్యంత ప్రధానమని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇటీవల కాలేజీలో ఉద్యోగ విరమణ చేసిన అధ్యాపకులు నల్లూరి శ్రీనివాసరావు, డి.ఉదయ ప్రకాష్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించి ఆయన గొప్పతనాన్ని ప్రిన్సిపాల్ వివరించారు. విద్యార్థిని పి.కమణని కూచిపూడి నృత్యం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడపా కేదారి, అధ్యాపకులు నున్న శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

గుడ్లవల్లేరు: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని గుడ్లవల్లేరు శ్రీ సాయి విద్యానికేతన్ అధినేత సింగంశెట్టి ఆదినారాయణ(చిన మాస్టారు) అన్నారు. ఆయన ఆధ్వర్యంలో పాఠశాల్లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన్ను టీచర్లు ఈ సందర్భంగా సన్మానించారు. ఎన్నో రంగాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు తాము చదువు చెప్పామని ఆదినారాయణ పేర్కొన్నారు. 1980వ సంవత్సరంలో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించి 45ఏళ్ల పాటు విద్యార్థులకు చదువులు చెప్పి చిన మాస్టరుగా గుర్తింపు పొందటం తన పూర్వ జన్మ సుకృతమన్నారు. ఉపాధ్యాయినులు షేక్ రహీమా, ఎస్.సువర్ణ, సీహెచ్.వెంకటేశ్వరమ్మ, డి.కమలాదేవి, ఎన్.మహాలక్ష్మి, కె.కుసుమ, దుర్గ పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: ఐనపూరు హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిపారు. హెచ్ఎం వేణు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు హెచ్ఎం తమ్మన వేణుగోపాలరావు, సీనియర్ ఉపాధ్యాయులు బుజ్జమ్మ, నాగేశ్వరరావును సత్కరించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

పమిడిముక్కల: మండలంలోని అలీనఖీపాలెం ఉర్దూ పాఠశాల హెచ్ఎం మీర్జా నవాజిష్ హుస్సేన్‌ను జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో జేసీ గీతాంజలిశర్మ, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా నవాజిష్ హుస్సేన్‌ను సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతను ఎంఈఓలు పద్మారాణి, శ్రీనివాస్, ఎంపీపీ కాసాని వేద సుప్రజ అభినందించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: మండలంలో ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన వారిని అభినందించారు. స్థానిక ఏజీకే హైస్కూల్లో ఏజీకే షటిల్ కోర్టు సభ్యులు ఎం.అమ్మన్న బాబు, పి. అప్పారావును కోర్టు సభ్యులు సత్కరించారు. స్థానిక సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో ప్రిన్సిపాల్ చోడవరపు విజయ కుమార్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులు డి. సత్యనారాయణ, సీహెచ్ కుసుమకుమార్, పి. రూపవతిని సత్కరించారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో గురు పూజోత్సవం జరిగింది. కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ పాల్గొన్నారు.

సమాజ నిర్దేశకులు గురువులు

ముదినేపల్లి రూరల్: సమాజానికి గురువులు మార్గ నిర్దేశకులని స్థానిక ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు అన్నారు. స్థానిక ఎస్సార్అండ్‌వీఆర్ కళాశాల్లో టీచర్స్ డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. అనంతరం ఎస్ఐని కళాశాల విద్యార్థులు సత్కరించారు.



కైకలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువులను సన్మానించిన డీఎన్నార్

గురుభక్తి విజయానికి నాంది

కైకలూరు: గురుభక్తి విజయానికి పునాది వంటిదని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కైకలూరు పార్టీ కార్యాలయంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఎలుగుల వేణుగోపాలరావు, చిట్టి పార్వతీశం, కర్రే డేవిడ్‌రాజును శుక్రవారం సత్కరించారు. డీఎన్నార్ మాట్లాడుతూ విద్యార్థికి, ఉపాధ్యాయుడికి ఉన్న బంధం విడదీయరానిదన్నారు. విద్యార్థి విజయంలో గురువు పాత్ర కీలకమన్నారు. సన్మాన గ్రహీతల్లో ఒకరైన వైఎస్సార్ సీపీ జిల్లా ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగ అధ్యక్షుడు వేణుగోపాలరావు మాట్లాడుతూ తమ వద్ద చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడు చూసి గురువు ఉప్పొంగిపోతారన్నారు. ఉపాధ్యాయులను గుర్తించి గౌరవించిన డీఎన్నార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ బలే నాగరాజు, రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రటరీ ఎండీ గాలిబ్ బాబు, మండల పార్టీ అధ్యక్షుడు సింగంశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఏజీకే షటిల్ కోర్టు టీమ్ సభ్యులు



కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఉపాధ్యాయ దినోత్సవం




గుడ్లవల్లేరులో చిన మాస్టారును సన్మానించిన టీచర్లు



ఐనపూరు హైస్కూల్లో ఉపాధ్యాయులను సత్కరించిన విద్యార్థులు

ఉత్తమ ఉపాధ్యాయుడిగా వెంకట అప్పారావు



మండవల్లి: మండలంలోని పుట్లచెరువు జెడ్పీ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు తమ్మిరెడ్డి వెంకట అప్పారావు ఏలూరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయన 2009లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు సామాజిక బాధ్యతగా 49 మందికి రక్తదానం చేశారు. 2023లో లయన్స్ క్లబ్ ఉత్తమ టీచర్ అవార్డు అందించింది. ఆయనతో పాటు లింగాల ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు మేడా శ్రీను, చాలిపాడు ఎంపీపీ స్కూల్ టీచర్ కుసుమకుమారి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందినవారిలో ఉన్నారు.



ఎస్ఐని సన్మానించిన కళాశాల విద్యార్థినులు

మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయడం దారుణం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్



పామర్రు(మొవ్వ): ఆరోగ్య రంగాన్ని మరింత బలపరచాల్సిన ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేసేలా తీసుకున్న రెండు నిర్ణయాలను పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ కైలే అనిల్‌కుమార్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు ఓ పత్రికా ప్రకటనను పామర్రు పార్టీ కార్యాలయం నుంచి శుక్రవారం విడుదల చేశారు. గత ప్రభుత్వంలో పేదపిల్లలకు కూడా వైద్య విద్యను అందించాలనే సంకల్పంతో ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో ఒక మెడికల్ కాలేజీ ఉండాలన్న లక్ష్యంతో రూ.8,480 కోట్లతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం మొదలు పెట్టినట్లు తెలిపారు. కొన్నింటిని పూర్తిచేసి, మరికొన్ని శరవేగంగా ముందుకు తీసుకెళ్లారన్నారు. రూ.2,403 కోట్లు ఖర్చు చేసి, విజయనగరం, మచిలీపట్నం, రాజమండ్రి, ఏలూరు, నంద్యాల వైద్య కళాశాలలు నిర్మాణం పూర్తిచేసి 2023–24 విద్యాసంవత్సరంలో 750 సీట్లతో క్లాసులు మొదలుపెట్టిందని పేర్కొన్నారు. పాడేరు, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోనిలోని మెడికల్ కళాశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి అందుబాటులో ఉండేలా నిర్మాణాలను చేపట్టారని తెలిపారు. ఈ నేపథ్యంలో బడుగు బలహీన వర్గాల పిల్లలు వైద్య విద్యను అభ్యసించడం ఏమాత్రం ఇష్టంలేని చంద్రబాబు ఆయన గ్యాంగ్ వైద్య కళాశాలల నిర్మాణాలను కొనసాగించలేదని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల నిర్వహణ భారం అవుతుందని కుంటిసాకులు చూపి 10 మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తూ తన వాళ్లకు కట్టబెట్టేలా నిర్ణయాలు తీసుకోవడం దారుణమని తెలిపారు.

ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేలా చర్యలు

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలకు సంజీవని లాంటి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి చరిత్రలో నిలిచిపోతే, తండ్రి బాటలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పథకానికి కొత్త జవసత్వాలు అందించారని కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా మొత్తం 3,257 చికిత్సలు రూ.25 లక్షల వరకు ఉచితంగా వర్తించేలా ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత వన్నెతెచ్చారని పేర్కొన్నారు. అలాంటి ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేలా చర్యలు తీసుకుంటున్న సీఎం చంద్రబాబునాయుడు చరిత్రహీనుడిగా నిలిచిపోతారని తెలిపారు.

ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించని కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలు దాదాపు రూ.3,750 వేల కోట్లు చెల్లించక పోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు దాదాపుగా సేవలు నిలిపేశాయని కైలే అనిల్‌కుమార్ తెలిపారు. బకాయిలు చెల్లించకుండా ఉచితంగా వైద్య సేవలందించే కార్యక్రమాన్ని రద్దు చేసి, ఇప్పుడు ప్రైవేటు పరం చేసి బీమా విధానానికి శ్రీకారం చుడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యవస్థలను ప్రైవేట్ పరం చేసే నిర్ణయాల వెనుక భారీ కుట్ర దాగి ఉందని తెలిపారు. ఇటువంటి తప్పుడు ఆలోచనలను వెంటనే విరమించుకోవాలని, మెడికల్ కాలేజీల్లో మిగిలిన పనులు పూర్తి చేసి, పేద పిల్లలకు వైద్య విద్యను అందించేలా, పేదలకు సంజీవనిలాంటి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రైవేటు పరం కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం



గుడ్లవల్లేరులో గణనాథుడి పూజలో పాల్గొన్న భక్తులు



మొవ్వలో గణనాథుని ఊరేగింపు



గురజలో గణేశ్ విగ్రహానికి పూజలు చేస్తున్న ఎంపీపీ



కైకలూరు మండలం వదర్లపాడులో పూజలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో వినాయక విగ్రహ నిమజ్జనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్థానిక నాయీ బ్రాహ్మణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గణనాథుని తీన్‌మార్ డప్పులు, బాణసంచా పేలుస్తూ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. స్వామికి అడుగడుగునా మహిళా భక్తులు హారతులు పట్టారు. ప్రముఖ వేద పండితుడు డాక్టర్ అగ్నిహోత్రం ఫణిగోపాల్ ప్రత్యేక పూజలు చేశారు.

మొవ్వలో..

మొవ్వ: గత నెల 27వ తేదీ నుంచి భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడిని శుక్రవారం ఆనందోత్సాహాల మధ్య యువత, పెద్దలు నిమజ్జనాలకు తరలించారు. మొవ్వ మండల పరిధిలోని మంత్రిపాలెం, పెదపూడి, మొవ్వ తదితర గ్రామాల్లోని వినాయకులు నిమజ్జనాలకు తరలివెళ్లారు. ఇందులో భాగంగా మొవ్వ గ్రామంలోని యాదవ యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని డప్పు వాయిద్యాలు, డీజేల నడుమ గులాం రంగులతో ఉత్సాహంగా గ్రామంలో ఊరేంగింపు నిర్వహించారు.

గురజలో అన్నసమారాధన

ముదినేపల్లి రూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని గురజలో శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ గణేశ్ విగ్రహాన్ని దర్శించుకుని పూజలు చేసి సమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్ బాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు మేడూరి వెంకటేశ్వరరావు, వైస్ సర్పంచ్ కిరణ్మయి, వైఎస్సార్ సీపీ నాయకులు రాచూరి కుమార్, పోకల కృష్ణ, వెనిగల్ల రాంబాబు, పగడాల నాగు, మీసాల రామకృష్ణ, కూనపురెడ్డి సత్యనారాయణ, రంగిశెట్టి కొండా, పుట్టి సుబ్బారావు, దివి సతీష్, పవన్ పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు/కలిదిండి: నియోజకవర్గంలోని పలు మండలాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనాలు, అన్న సమారాధనలు శుక్రవారం ఎక్కువగా జరిగాయి. ఆలపాడు శివారు ఉప్పుటేరు, వదర్లపాడు, కైకలూరు శివారు కలిదిండి రోడ్, కలిదిండి మండలం ఆరుతెగళపాడు ఆంజనేయస్వామి గుడివద్ద జరిగిన అన్నసమరాధనల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్ తనయుడు దూలం వినయ్‌కుమార్ శుక్రవారం పాల్గొన్నారు. నాయకులు శాఖమూరి రాజా, తోట మహేష్, పంజా నాగు, సలాది వెంకటేశ్వరరావు, ఘంటసాల సురేష్, బండారు నాగరాజు, మడక శ్రీను, పేటేటి భాస్కరరావు, రామకృష్ణ, పెంటా అనిల్, బెల్లాని శ్యామలరావు, ఫిర్దోస్ ఖాన్, గంధం శ్రీను పాల్గొన్నారు.

రైతులకు మద్దతుగా కదలిరావాలి

కలిదిండి(కైకలూరు): యూరియా అవసరాలను తీర్చడంలో వైఫల్యం చెందిన కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టడానికి మండలంలో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని వైఎస్సార్ సీపీ కలిదిండి మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్ పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆదేశాల మేరకు ఈనెల 9న ఏలూరు ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రాలతో నిరసన కార్యక్రమంపై కలిదిండి కల్యాణి ఫంక్షన్ హాల్లో మండల స్థాయి నాయకుల సమాయత్త సమావేశం శుక్రవారం నిర్వహించారు. మండలాధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ మంగళవారం 10 గంటలకు ఏలూరు ఫైర్ స్టేషన్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి, శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించడానికి పెద్ద ఎత్తున అందరూ తరలిరావాలని కోరారు. జిల్లా రైతు విభాగ జనరల్ సెక్రటరీ వడుపు రామారావు, నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షుడు కొల్లాటి సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు అత్యవసరమైన యూరియాను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ముంద్రు చార్లెస్, పాము రవికుమార్, మండా నవీన్, పండు ఆనంద్ రవిరాజు, గండికోట ఏసుబాబు, జమాల్ షరీఫ్, గద్దె ఆనంద్, ఆరోగ్య జీవరత్నం, చాన్ బాషా, రమాదేవి, చిట్టూరి నాంచారయ్య, ఇమ్మానేని లక్ష్మణరావు, శేఖర్, పేటేటి వివేకానంద, సర్వర్, సిరివెల్ల దుర్గారావు, ఆకుల మురళీ తదితరులు పాల్గొన్నారు.



కలిదిండిలో యూరియా కోసం నిరసన కార్యక్రమంపై మాట్లాడుతున్న పార్టీ నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: విద్యుత్ లైన్లకు అడ్డువచ్చే చెట్ల కొమ్మలను తొలగించేందుకు పల్లెవాడ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని పల్లెవాడ ఫీడర్‌కు శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ జీబీ.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పల్లెవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ నిలుపుదల ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 7 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. ఫీడర్ పరిధిలోని సింగరాయపాలెం చేవూరు గ్రామాల్లో విద్యుత్ లైన్లకు దగ్గర్లో ఉన్న చెట్లను తొలగించడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలోని యలమర్రు ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వరకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆలయ పాలక వర్గాల ప్రమాణ స్వీకారం

గుడివాడ టౌన్: పట్టణంలోని దేవదాయ శాఖకు చెందిన ఆలయాల్లో పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారాలు శుక్రవారం నిర్వహించారు. స్థానిక కాకర్లవీధిలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం, శ్రీ ఘంటసాల నాగభూషణం ఆర్యవైశ్య అన్నదాన సత్రం పాలక వర్గం అధ్యక్షుడిగా అంగడాల సతీష్, సభ్యులుగా కె. శ్రీనివాస్, డి. చంద్రశేఖర్, కె. ఆంజనేయులు, ఎం. సీతారామయ్య, పి. శాంతి, ఎం. దుర్గా పద్మజ, ఎం. నాగమణి, ఎక్స్ అఫిషియో సభ్యులుగా అర్చకులు నల్లపాటి శ్రీనివాస్, దాశరథి ప్రమాణ స్వీకారం చేశారు.

శ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థానంలో..

స్థానిక గౌరీశంకరపురంలోని శ్రీ గౌరీశంకరస్వామి వారి దేవస్థానం నూతన పాలకవర్గ అధ్యక్షుడిగా ఎస్. సుభాష్ చంద్రబోస్, పాలక మండలి సభ్యులుగా ఎ. మల్లికార్జున స్వామి, పి. శ్రీనివాస్, పి. శ్రీకుసుమ, వై. జయలక్ష్మి, బి. వరలక్ష్మి, ఎస్. భవాని, కె. నాగేశ్వరరావు, ఎక్స్ అఫిషియో సభ్యులుగా అర్చకులు లంక గిరిచంద్ర ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు పాల్గొన్నారు.



వేణుగోపాల స్వామి దేవస్థానంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

రైతు పంటలకు గిట్టుబాటు ధరపై చట్టం చేయాలి

చినముత్తేవి(మొవ్వ): పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ చట్టం చేయాలని అన్ని పంటలకు మద్దతు కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై కేశవరావు డిమాండ్ చేశారు. ఆదర్శ కమ్యూనిస్టు దంపతులు రావూరి అజయకుమార్, విజయలక్ష్మి వర్ధంతి సభలో మొవ్వ మండలం చినముత్తేవిలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయదారులు ఎదుర్కొంటున్న సమస్యలు–పరిష్కారం మార్గాలు అంశంపై రైతు సంఘం నాయకుడు వై. కేశవరావు మాట్లాడారు. అమెరికన్ ప్రభుత్వం మన దేశ పంటలకు నష్టాలు కల్పించే విధంగా టారీఫ్ విధానాలు ఉన్నాయని వాటిని వ్యతిరేకించాలన్నారు. రైతులందరికీ ఎరువులు పురుగుమందులు సబ్సిడీపై ఇవ్వాలని, రైతులకు సరిపడా యూరియా అందించాలి కోరారు. తొలుత రావూరి అజయకుమార్, విజయలక్ష్మి చిత్రపటాలకు నివాళులర్పించారు. సీపీఎం నాయకులు మద్దుల బసవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి నరసింహారావు, నాయకులు రావూరి రమేష్, సీపీఎం చినముత్తేవి శాఖ కార్యదర్శి మాదాసు నాగులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు కేశవరావు

యూరియా కొరతపై 9న వినతిపత్రం సమర్పణ



సమావేశంలో పాల్గొన్న మండవల్లి మండల వైఎస్సార్ సీపీ నాయకులు

మండవల్లి: యూరియా కొరతపై నిరసన తెలుపుతూ వైఎస్సార్ సీపీ తరపున ఈ నెల 9న ఉదయం 10 గంటలకు ఏలూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి, వినతిపత్రం ఇవ్వనున్నట్లు పార్టీ నాయకులు శుక్రవారం తెలిపారు. మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు. నాయకులు, ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు చేబోయిన వీర్రాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గుమ్మడి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు బేతపూడి ఏసోబురాజు, సర్పంచ్‌లు నాగదాసి థామస్, శేషగిరిరావు, మెండ సురేష్‌బాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉనికిలి సర్పంచ్‌కు మద్దతుగా నిరాహార దీక్ష



మండవల్లి: ఉనికిలి సర్పంచ్ ఇమ్మడి అన్నమ్మ పట్ల ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి సజ్జా వెంకట రాధిక కుల దురహంకార వైఖరికి నిరసనగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద న్యాయవాది సరిపల్లి అశోక్‌కుమార్ నిరాహార దీక్ష శుక్రవారం చేపట్టారు. న్యాయవాది మాట్లాడుతూ సదరు కార్యదర్శిపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. మండలంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ పనితీరు దయనీయంగా ఉందని వాపోయారు. కార్యదర్శిపై పెట్టిన అర్జీలకు సమాధానం చెప్పాలని, సదరు కార్యదర్శిపై విచారణకు ఆదేశించాలని కోరారు.

ప్రకటన

[illegible]